
ధాన్యం కొనుగోళ్లు
సజావుగా జరగాలి
- ఆ దిశగా పటిష్ఠ కార్యాచరణ చేపట్టాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- అధికారులతో కొనుగోలు సన్నాహక సమావేశం

6

టీడీపీ జిల్లా నేతలతో
చంద్రబాబు సమావేశం
- హాజరైన పలువురు నాయకులు
- జిల్లాలో పార్టీ పరిస్థితి, రాజకీయాలపై చర్చ

6


మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం 9 అక్టోబరు 2025


ప్రజా పాలనలో అన్ని వర్గాల
సంక్షేమం
- సీఎం రేవంత్ సహకారంతో రఘునాథపాలేనికి మహర్దశ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలు కుటుంబాలు
- తుమ్మల క్యాంపు కార్యాలయంలో కోలాహలం
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ చేరికల పర్వం


ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజా పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, సీఎం రేవంత్ నేతృత్వంలో ప్రజలు మెచ్చే రీతిలో ప్రభుత్వం పనిచేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం వెలువడుతున్న నేపథ్యంలో.. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికల పర్వం మొదలైంది. ఈ క్రమంలో ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో

మిగతా 6లో

అక్రమ స్కానింగ్ సెంటర్‌పై
వైద్యాధికారుల దాడి
- స్కానింగ్ మిషన్ స్వాధీనం..
- ఓ ఇంట్లో అనధికారికంగా సెంటర్ నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు


స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుంటున్న వైద్యాధికారులు

7

ప్రాదేశిక..
నోటిఫికేషన్ నేడే


- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు రంగం సిద్ధం
- తొలివిడతలో 10 జడ్పీటీసీ, 149 ఎంపీటీసీలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హైకోర్టులోనే రిజర్వేషన్లపై విచారణ..
- పార్టీలు, ఆశావహులను వీడని ఉత్కంఠ.. నామినేషన్లకు సిద్ధంగా ఉండాలని కేడర్‌కు సూచనలు

ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల కేటాయింపు అంశానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. బుధవారం సుదీర్ఘ వాదనల అనంతరం గురువారానికి వాయిదా వేయడంతో ఆ ఉత్కంఠ ఇంకా తొలగలేదు. అయితే రాష్ట్ర ఎన్నికలసంఘం మాత్రం జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికల నోటిఫికేషన్లకు సిద్ధం కావాలని ఆదేశించడంతో ఆదిశగా జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం 10:30గంటలకు తొలివిడత ఎన్నికలు జరిగే ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుండగా.. ఆ వెంటనే మండల రిటర్నింగ్ అధికారులు.. మండల కార్యాలయాల్లో నామినేషన్లను స్వీకరించనున్నారు.

జిల్లాలో మొత్తం 8,02,690మంది ఓటర్లుండగా 3,88,240మంది పురుషులు, 4,14,425 మంది మహిళలున్నారు. మొదటి విడతగా 10 జడ్పీటీసీలు ,149 ఎంపీటీసీలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. తొలివిడతలో కామేపల్లి, బోనకల్, చింతకాని, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, ఖమ్మంరూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని 10 జడ్పీటీసీ స్థానాలు, 149 మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. కామేపల్లిలో 12 ఎంపీటీసీలు, బోనకల్ 13, చింతకాని 14, మధిర 12, ముదిగొండ 17, ఎర్రుపాలెం 14, ఖమ్మంరూరల్ 14, కూసుమంచి 17, నేలకొండపల్లి 18, తిరుమలాయపాలెం మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడనుంది.

నేటి నుంచి నామినేషన్లు

తొలివిడత ఎన్నికలు జరిగే పది జడ్పీటీసీలు, 149ఎంపీటీసీలకు ఉదయం 10:30గంటలకు రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుంది. ఈ ప్రక్రియ ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. ఇక నామినేషన్ల స్వీకరణ అనంతరం 12న పరిశీలన, 13న అభ్యంతరాలు స్వీకరణ, 14న అభ్యంతరాలపై నిర్ణయం, 15న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఆదేరోజు సాయంత్రం 3గంటలకు బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను ప్రకటిస్తారు. ఇక 23వ తేదీన ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. నవంబరు11న కౌంటింగ్ ఉంటుంది. బ్యాలెట్ పద్ధతిలో పార్టీ గుర్తులపై జరిగే ఈ ఎన్నికలపై హైకోర్టు విచారణ ప్రభావం పడుతోంది. గురువారానికి విచారణ వాయిదా పడటంతో ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొంది.

పార్టీల్లో, ఆశావహుల్లో అయోమయం..

హైకోర్టు తుదితీర్పు రాకుండా (మిగతా 8వ పేజీలో)

నామినేషన్ల స్వీకరణకు
పటిష్ఠ ఏర్పాట్లు చేశాం
- వీసీలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు వివరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

8


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులు

'విడత'లపై స్పష్టత
- జిల్లాలో మారిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్
- ప్రకటించిన అధికారులు.. రాజకీయపార్టీలతో సమావేశం
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

6

రండి బాబూ రండి
- మద్యం టెండర్ల దాఖలు చేసుకోండంటూ ఎక్సైజ్ అధికారుల వేడుకోలు
- గత ఏడాది టెండరు దార్లు, వ్యాపారులకు మెసేజ్‌లు, ఫోన్ కాల్స్
- అబ్కారీ శాఖ స్పెషల్ డ్రైవ్

ఇల్లెందు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి.. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. లాటరీ తగిలిందా..!? లక్షల ఆదాయం అంటూ ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అధికారులు మద్యం టెండర్ల దరఖాస్తుల వేట సాగిస్తున్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తులు త క్కువగా వస్తుండడంతో.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అబ్కారీ శాఖ అధికారులు పట్టణంలో వర్తక వ్యాపారులు, ఆర్థికంగా బలంగా ఉన్న బడాబాబులు, గత ఏడాది మద్యం టెండర్లు దాఖలు చేసినవారికి ప్రత్యేకంగా మెసెజ్‌లు పెడుతున్నారు. అలాగే ఫోన్‌కాల్స్ చేస్తూ ఎక్కువమొత్తంలో దరఖాస్తులు.. తద్వారా ఆదాయం లభించేలా ము మ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత అబ్కారీ సీజన్ మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనప్పటి కీ 2023-25 నాటి ఉత్సాహం మద్యం వ్యాపారుల్లో కనబడడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ ప్రోహిబిషన్ విభాగం అధికారులు మద్యం దుకాణాల దరఖాస్తుల సంఖ్యను పెంచే వ్యూహంతో వినూ త్న చర్యలు ప్రారంభించారు. జిల్లాలో 2025-27 సీజన్‌కు సంబంధిం చి 88 మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. కొత్తగూడెం పట్టణంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయా ల్లో ప్రారంభించిన దరఖాస్తుల స్వీకరణలో బుధవారం సాయంత్రం నాటికి 21మంది మాత్రమే నాన్ రిఫండబుల్ రుసుము రూ. 3లక్షల చొప్పున చెల్లించి దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలో గత ఏడాది 2023-25 కాలానికి 2023 నవంబరు నెలలో దుకాణాల కేటాయింపు ల్లో 88 మద్యం దుకాణాలకు 5,057 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో మద్యం షాపునకు 57 దరఖాస్తులు రావడంతో ప్రభుత్వానికి భారీ మొత్తంలో ఆదాయం లభించింది. అయితే గత ఏడాది సీజన్‌లో రూ.2లక్షల మాత్రమే చెల్లించే అవకాశం ఉండడంతో.. పెద్దసంఖ్య లో దరఖాస్తులు దాఖలయ్యాయి. కాగా.. ఈ ఏడాది 2025-27 రెండు సంవత్సరాల కాలానికి సంబంధించి మద్యం దుకాణాల దరఖాస్తుల దాఖలుకు ఒక్కో దరఖాస్తు ధరను ప్రభుత్వం రూ.3లక్షలకు పెంచిం ది. ఫలితంగా గతంలో మాదిరిగా మద్యం వ్యాపారులు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసిం ది. అయితే ఈ ఏడాది ద రఖాస్తుల సంఖ్య తగ్గినా.. గతంలో లభించి న దరఖాస్తుల ఆదాయం ఈ ఏడాది కూడా తగ్గకపోవచ్చన్న భావన అధికార, అనధికార వర్గాల్లో వినిపిస్తోంది.

ఏపీ ఎక్సైజ్ విధానం ప్రభావం కూడా..

ఈ ఏడాది మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువలా దాఖలు కాకపోవడానికి పొరుగున ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో అమలులోకి వచ్చిన ఎక్సైజ్ పాలసీ కూడా కారణంగా భావిస్తున్నారు. గతంలో ఆంధ్ర రాష్ట్రంలో మద్యం అమ్మకాలను ప్రభుత్వం ఆధీనంలోనే నిర్వహించడంతో ఆ రాష్ట్రంలోని మద్యం వ్యాపారులు.. తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించి మద్యం షాపులకు దరఖాస్తు చేశారు. ప్రత్యేకించి సమీపంలో ఖమ్మం జిల్లాల మద్యం దుకాణా ల కోసం రూ.2లక్షల చొప్పున చెల్లించి భారీసంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. కాగా.. ఆంధ్రరాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల తో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణ నుంచి వైదొలిగి తెలంగాణలో మాదిరిగా లాటరీ పద్ధతిలో దరఖాస్తులకు మద్యం దుకాణాల కేటాయింపు విధానాన్ని అమలులోకి తీసుకొచ్చిం ది. దీంతో పొరుగురాష్ట్రం మద్యం (మిగతా 6వ పేజీలో)




ఖమ్మంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఈఎస్ నాగేంద్రరెడ్డి

ఉమ్మడి జిల్లాలో
58 దరఖాస్తులు
- దసరా తర్వాత వచ్చినవే ఎక్కువ
- సమీపిస్తున్న లాటరీ తేదీ
- ఇక్కడి షాపులపై ఏపీ వ్యాపారుల కన్ను

6


తుమ్మలతో సమావేశమైన టీటీడీ బృందం (ఫైల్)

20ఎకరాల్లో
వేంకటేశ్వర ఆలయం
- ఖమ్మంలో నిర్మాణానికి టీటీడీ సానుకూలత
- భూమి అప్పగించాలని రాష్ట్ర దేవాదాయశాఖకు లేఖ
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి

6

సింగరేణిలో
సమ్మెలు నిషేధం
- తెలంగాణ ఎస్మా కింద నోటిఫికేషన్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ఎస్మా-1971 కింద నోటిఫికేషన్ ఇస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం జీవో జారీ చేశారు. ఈ నిషేధం గత సెప్టెంబరు 11వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. నిషేధం 6 నెలల పాటు అమలులో ఉండనుంది.



పాత్రధారులపై వేటు..
త్వరలో సూత్రధారిపై!
- చింతకాని సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్
- త్వరలో మరికొందరిపై వేటు?
- ఆదేశాలు జారీ చేసిన చీఫ్ కన్జర్వేటర్
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో కలప అక్రమ పర్మిట్లు మంజూరులో అవినీతికి పాల్పడిన, సహకరించిన అధికారులు, ఉద్యోగులు ఒక్కొక్కరిపై వేటు పడుతో ంది. ఇప్పటి వరకు పాత్రధారులను వరుసగా సస్పెండ్ చేస్తున్న ఉన్నతాధికారులు త్వరలోనే సూత్రధారిపై వేటు వేసే అవకాశం ఉందని అటవీ శాఖలో చర్చ జరుగుతోంది. ఇటీవల చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌పై జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ (మిగతా 6వ పేజీలో)

సమీకృత కార్యాలయాల ఏర్పాటుపై కలెక్టర్ సమీక్ష

కల్లూరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సమీకృత కార్యాలయాల సముదాయం ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో సదరు కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అయితే ఆయా కార్యాలయాల ఏర్పాటుకు గాను ప్రభుత్వం తరుపున సుమారు రూ.57కోట్లు నిధుల అవశ్యకతపై కూడా పంచాయితీ రాజ్ శాఖ వారు అంచనా వేశారు. ఆయా కార్యాలయాలకు గాను ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద గల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పటికే అధికారులు గుర్తించారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ మ్యాప్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారని తెలిసింది. సమీక్షలో తహసీల్దార్ పి .సాంబశివుడు, ఆర్‌ఐ ఉమమాహేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్



'విడత'లపై స్పష్టత

- ఖమ్మం జిల్లాలో మారిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్
- ప్రకటించిన అధికారులు.. రాజకీయ పార్టీలతో సమావేశం
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ విడతలు మారిపోయాయి. ఈ మేరకు కొత్త షెడ్యూల్‌ను జిల్లా అధికారులు ఖరారు చేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అంతే కాదు జడ్పీ సీఈవో దీక్షరైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించి మారిన పంచాయతీ ఎన్నికల విడతలను ప్రకటించారు. మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు గాను జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపిన నివేదిక ప్రకారం రాలేదని, ఆ విడతలు తారుమారయ్యాయని 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'విడతలు.. తారుమారు' అంటూ కథనాన్ని ప్రచురించింది. మారిన ఆ విధానంలోనే అధికారులు పంచాయతీ ఎన్నికల విడతలను ప్రకటించడం గమనార్హం.

మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీలివే..

మండలం	పంచాయతీలు	వార్డులు
బోనకల్	22	210
చింతకాని	26	248
కొణిజర్ల	27	254
మధిర	27	236
రఘునాథపాలెం	37	308
వైరా	22	200
ఎర్రుపాలెం	31	284
మొత్తం	192	1740

రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలివే..

మండలం	పంచాయతీలు	వార్డులు
కామేపల్లి	24	218
ఖమ్మం రూరల్	21	202
కూసుమంచి	41	364
ముదిగొండ	25	246
నేలకొండపల్లి	32	300
తిరుమలాయపాలెం	40	356
మొత్తం	183	1686

మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలివే..

మండలం	పంచాయతీలు	వార్డులు
ఏన్కూరు	25	216
కల్లూరు	23	214
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
సింగరేణి	41	356
తల్లాడ	27	252
వేంసూరు	26	244
మొత్తం	196	1788

గోదావరి కరకట్టపై...
విరిగిన కైక విగ్రహం

- గుర్తు తెలియని వ్యక్తుల పనేనని అనుమానం
- భద్రాద్రిలో ఇలాంటి ఘటన ఇదే తొలిసారి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన దేవస్థానం అధికారులు

భద్రాచలం,, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని గోదావరి కరకట్టపై ఉన్న కైక విగ్రహం విరిగిపడింది. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి స్పష్టత లేదు. గుర్తు తెలియని వ్యక్తులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలంలో రెండున్నర దశబ్దాల కాలంలోని 2002 సమయంలో గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కరకట్టకు సరికొత్త అందాలను తెచ్చే క్రమంలో రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న దృశ్యాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ప్రముఖ సినీ దర్శకులు బాపు సూచనలతో రామాయణ రమణీయ దృశ్యాలకు చెందిన బొమ్మలను కరకట్టపై ఏర్పాటు చేశారు. వివిధ సన్నివేశాలను వివరించే ఆ బొమ్మలు రామభక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఎవరూ ఊహించని రీతిలో సబ్‌జైలు వెనుక భాగంలో ఉన్న దశరుడు, రామలక్ష్మణులు, కైక ఉన్న కైకవరాలు అనే సన్నివేశంను ప్రతిబింబించే బొమ్మలోని కైక బొమ్మను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టి పడేసారు. ఇది తాగుబోతుల పనా లేకా మరెవరైనా చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటన భద్రాద్రిలో చోటు చేసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇదిలా ఉండగా ఈ విషయం భద్రాద్రి దేవస్థానం అధికారుల దృష్టికి రాగా వారు వెంటనే స్పందించి కైక విగ్రహన్ని దేవస్థానం కార్యాలయంకు తరలించారు. అనంతరం ఈ విషయంపై పట్టణ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు.


కైక బొమ్మను విరగ్గొట్టి పడేసిన దృశ్యాలు



రేపటి నుంచి రాష్ట్రస్థాయి టీటీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలోని టీటీ ఇండోర్ హాల్‌లో శుక్రవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు బాలసాని సన్యాసయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు స్టేడియంలో పోటీల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. పోటీల్లో అండర్- 11 బాల, బాలికల విభాగం నుంచి సీనియర్ మెన్ అండ్ ఉమెన్, 45 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు గల వారికి మొత్తం 11 కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉన్న స్టార్ ప్లేయర్స్ సైతం పాల్గొంటున్నారన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆదరించాలని వారు కోరారు.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలున్నారు. అందరిపై సుమారు రూ.70లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ డిప్యూటీ కమాండర్, పీఎల్‌జీఏ పార్టీ సభ్యుడు, ఏసీఎం, జనతర సర్కార్ కమిటీ, మాడ్ ఏరియా కమిటీ మెంబర్లు, మిలీషియా సభ్యులున్నారని పోలీసులు పేర్కొన్నారు. వీరంతా నారాయణపూర్, అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో నిందితులని, మావోయిస్టులు లొంగిపోతే వారికి ప్రభుత్వ సాయం అందజేస్తామని నారాయణపూర్ పోలీసులు పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కొత్తగూడెంలో అట్టహాసంగా 69వ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాల క్రీడలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ క్రీడాకారులకు సూచించారు. బుధవారం కొత్తగూడెం లోని ప్రకాశం మైదానంలో అట్టహాసంగా 69వ జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ పాఠశాల క్రీడల ప్రారంభోత్సవంలో క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి భద్రాద్రి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని, క్రీడాకరుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్‌వో శాఖ పర్యవేక్షణలో తనను నేరుగా సంప్రదించాలని కోరారు. రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్ -14, 17 విభాగాలలోని బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో...ఖో..., అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేస్తామని జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్‌వో పరందామరెడ్డి, డిసిఈబి సెక్రెటరీ నీరజ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, యనమదల వేణు గోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ అంపైర్లుగా వ్యవహరించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఎన్నికల కోడ్ అడ్డంకితో ఆగిన ఆదికర్మ యోజన ప్రణాళికలు

కేంద్ర అధికారులకు సమాచారం ఇచ్చిన ఐటీడీఏ

భద్రాచలం,, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో అమలుచేయాల్సిన ఆదికర్మ యోజనా పథకంకు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. మొత్తం 19 మండలాల్లోని 130 గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి స్థానికుల అవసరాలను గుర్తించి వారి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విద్యుత్తు, విద్య, రహదారులు, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణలు, క్రీడా మైదానాలు తదితర అవసరాలను గుర్తించి ఇందుకు సంబంధించిన ప్రణాళికలను గ్రామసభ ఆమోదంతో రూపొందించి జిల్లా అధికారుల ద్వారా కేంద్రానికి ప్రణాళికలను పంపాల్సి ఉంది. వాస్తవానికి ఈ నెల 2వ తేదీ లోపు ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారంను కేంద్ర ప్రభుత్వ శాఖకు నివేదిక పంపాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా అధికారుల ఆమోదం తీసుకొని పంపలేకపోతున్నట్లు ఇప్పటికే ఐటీడీఏ అధికార వర్గాలు కేంద్ర ప్రభుత్వ అధికార వర్గాలకు సమాచారం ఇచ్చాయి. వాస్తవానికి ఆదికర్మ యోజన పథకం అమలుతో గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి పదంలో పయనించేందుకు వీలుంటుందని రూ.2నుంచి రూ.5 కోట్ల వరకు ఒక్కొక్క గ్రామానికి అవసరాల రీత్యా నిధులొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల కోడ్ ప్రక్రియ ముగిసిన అనంతరమే పథకంకు సంబంధించిన ప్రణాళికల ఆమోదం నివేదికలను కేంద్రానికి పంపుతామని తెలిపారు. స్థానిక అధికారులకు సమాచారం అందించడంతో కేంద్ర ప్రభుత్వ అధికారులు సైతం ఇందుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

20ఎకరాల్లో వేంకటేశ్వర ఆలయం

- ఖమ్మంలో నిర్మాణానికి టీటీడీ సానుకూలత
- భూమి అప్పగించాలని రాష్ట్ర దేవాదాయశాఖకు లేఖ
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి

ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఖమ్మంలోని అల్లీపురం వద్ద 20ఎకరాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సానుకూలత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి భూమిని సేకరించి ఇవ్వాలంటూ తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖను టీటీడీ లిఖిత పూర్వకంగా కోరటంతో.. భూ సేకరణ విషయమై కలెక్టర్‌కు దేవాదాయ శాఖ కమిషనర్ శైలజారామయ్యర్ ఆదేశాలుజారీ చేశారు. కొంతకాలం క్రితం ఖమ్మంలో టీటీడీ తరఫున ఆలయం నిర్మించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు ఏపీ సీఎం చంద్రబాబునాయుడికి లేఖ ద్వారా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఆయన వినతిని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారుల బృందం ఖమ్మంలోని అల్లీపురం, ర ఘునాథ పాలెం మండలంలోని భూములు పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి ఆలయ నిర్మాణానికి టీటీడీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అలాగే టీటీడీ బృందం భూములను కూడా పరిశీలించి వెళ్లింది. అనంతరం ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి సానుకూలత వ్యక్తం చేస్తూ భూ సేకరణకు సంబంధించి దేవాదాయ శాఖను కోరడంతో అల్లీపురం ప్రాంతంలో కలియుగదైవం కొలువుదీరనున్నాడు.

ఖమ్మం జిల్లా టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం


వనమా వాసును అభినందిస్తున్న చంద్రబాబు

ఖమ్మం మామిళ్ల గూడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో టీడీపీ పతాకం ఎగరాలన్నదే లక్ష్యంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. బుధవారం తెలంగాణ తెలుగుదేశంపార్టీ కీలక నాయకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణలో పార్టీ పరిస్థితులు, ఖమ్మం జిల్లాలో టీడీపీ స్థితిగతులు, నాయకుల సమన్వయం, కేడర్ చైతన్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం అనంతరం చంద్రబాబు ఖమ్మం జిల్లా నాయకుడు వనమా వాసును ప్రత్యేకంగా అభినందించారు. ఖమ్మం జిల్లా బాధ్యు లు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, వనం వాసుతో అన్నారు.

ప్రజా పాలనలో అన్ని వర్గాల సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో బుధవారం రాజకీయ కోలాహలం నెలకొంది. రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం, ఈర్లపుడి గ్రామాల్లోని బీఆర్‌ఎస్‌కు చెందిన 85కుటుంబాలు మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సహకారంతో రఘునాథపాలెం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ మండలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్వామినారాయణ గురుకుల పాఠశాల ఏర్పాటుతో మండలం విద్యారంగంలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. సాగునీటి వసతితో ఉద్యాన పంటల సాగుకు, ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మేయర్ పునుకొల్లు నీరజ, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, కాంగ్రెస్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు దీప్లానాయక్, సాధురమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, పాలెపు వెంకటరమణ, గాజుల కృష్ణ, తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో మంత్రి తుమ్మల సహకారంతో ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలంతో పాటు జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో దిరిశాల వెంకటేశ్వర్లు, అల్లిక సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రండి బాబూ రండి!

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో మద్యం దుకాణాలకు గతంలో మాదిరిగా పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసేందుకు సిద్ధపడడం లేదని ఎక్సైజ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దానికి తోడు ఒక్కో దరఖాస్తుకు రూ. 3లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ సొమ్ము చెల్లించాల్సి రావడం కూడా దరఖాస్తుల దాఖలుపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు భావిస్తున్నారు. అయితే దరఖాస్తుల దాఖలుకు మరో 10రోజులు గడువు ఉండడంతో.. దరఖాస్తుల సంఖ్య తగ్గినా ఎక్సైజ్ శాఖకు ఆదాయంలో పెద్ద మార్పేమి ఉండబోదన్న ధీమా ఎక్సైజ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

సగం దుకాణాలు ఏజెన్సీల్లోనే..

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో మొత్తం 88 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ విభాగం అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే వీటిల్లో 44దుకాణాలు ఏజెన్సీ ప్రాంతానికి చెందినవి కావడంతో గిరిజన చట్టాలకు అనుగుణంగా వాటిని గిరిజనులకు రిజర్వ్ చేశారు. మిగిలిన 44 మద్యం దుకాణాల్లో గౌడులకు 6 దుకాణాలు, ఎస్సీలకు 7 దుకాణాలు రిజర్వ్ చేశారు. మిగిలిన 31 మద్యం దుకాణాలు మాత్రమే ఓపెన్ క్యాటగిరీలో ఉన్నాయి. ఓపెన్ క్యాటగిరీ దుకాణాలకు కులంతో సంబంధం లేకుండా ఎవరైనా దరఖాస్తు చేసుకునే వీలుంది. అయితే మద్యం దుకాణాల కేటాయింపు తీరుపై మద్యం వ్యాపారులు, గౌడ, ఎస్సీ సామాజిక వర్గాల వారు కొంతమేర అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం గమనార్హం. జిల్లాలోని మొత్తం మద్యం దుకాణాలు యూనిట్‌గా తీసుకుని గౌడులకు, ఎస్సీ సామాజిక వర్గాలకు రిజర్వేషన్ వారీగా షాపులు కేటాయించడంలేదని, కేవలం నాన్ షెడ్యూల్డ్ ఏరియాల్లోని మద్యం షాపులతోనే రిజర్వేషన్లు ఖరారు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా మొత్తం ఒక యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు అమలు చేస్తే.. తమ సామాజిక వర్గాల వారికి అదనంగా కొన్ని మద్యం దుకాణాలు లభించేవన్న అభిప్రాయాలను ఆయా సామాజిక వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మద్యం దుకాణాలను దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న వ్యాపారులు వివిధ ఏరియాల్లో పెద్ద ఎత్తున సిండికేట్లుగా ఏర్పడి వైన్ షాపుల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో షాపు కోసం ఒక్కో సిండికేటు నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు సమర్పించేందుకు సమాయత్తమవుతున్నారు. ఏదైనా ఒక్కో టోకెన్‌కు షాపు లభించినా.. సిండికేటు కారణంగా మద్యం వ్యాపారులు నష్టపోకుండా ముందస్తు వ్యూహాలతో ఒక్కో షాపుకు ఐదు నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు చేయడం ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 58 దరఖాస్తులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు లాటరీ గడువు సమీపిస్తోంది. గత నెల 26న మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలవగా.. ఖమ్మం జిల్లాలోని 116, భద్రాద్రి కొత్తగూడెంలోని 88దుకాణాలకు ఇప్పటి వరకు 58 దరఖాస్తులు మాత్రమే అందాయి. వాటిలో కూడా దసరా తర్వాత వచ్చినవే అధికంగా ఉన్నాయి. దసరాకు ముందు ఒక్కో ఎక్సైజ్ స్టేషన్‌కు ఒకటి లేదా రెండు దరఖాస్తులు మాత్రమే అందాయి. దసరా తర్వాత కాస్త ఊపందుకున్నట్లు కనిపిస్తోంది.

ఖమ్మం జిల్లాలో 37, భద్రాద్రి జిల్లాలో 21 దరఖాస్తులు

ఈనెల 23న లాటరీ విధానంలో మద్యం దుకాణాలు కేటాయింపు జరగనున్న నేపథ్యంలో గత నెల 26 నుంచి బుధవారం వరకు ఖమ్మం జిల్లాలో 37 దరఖాస్తులు అందాయి. వాటిలో ఖమ్మం 1 స్టేషన్ పరిధిలో 24, ఖమ్మం 2 స్టేషన్‌లో 3, నేలకొండపల్లిలో 0, వైరా 1, మధిర 2, సత్తుపల్లి 4, సింగరేణి 3 దరఖాస్తులు అందాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 దరఖాస్తులు అందాయి. వీటిలో కొత్తగూడెంలో 1, పాల్వంచలో 2, అశ్వరావుపేట 16, భద్రాచలం 1, మణుగూరు 1, ఇల్లెందులో 0 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ సారి దరఖాస్తు ఫీజును రూ.3లక్షలకు పెంచడంతో చాలా మంది వెనుకాడుతున్నట్లు చర్చ జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా వైపు ఏపీ వ్యాపారులు

తెలుగురాష్ట్రాలకు ఖమ్మం జిల్లా సరిహద్దులో ఉండటంతో ఏపీలో మద్యం టెండర్లు జరిగితే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాపారులు అక్కడ పాల్గొంటారు. అలాగే తెలంగాణలో నోటిఫికేషన్ విడుదల జరిగితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మద్యం దుకాణాలకు ఏపీ మద్యం వ్యాపారులు దక్కించుకునేందుకు పోటీ పడతారు. అయితే దసరా తర్వాత వచ్చిన దరఖాస్తుల్లో ఏపీ మద్యం వ్యాపారులవే అధికంగా ఉన్నట్లు సమాచారం.

దరఖాస్తులు చేయటం చాలా తేలిక

● జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

మద్యం దుకాణాలకు చాలా సులువుగా దరఖాస్తులు చేయవచ్చు. దరఖాస్తుదారుడు ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లుతో పాటు రూ. 3లక్షల డీడీ లేదా చలాన్ ఇస్తే సరిపోతుంది. ప్రతి కౌంటర్ దగ్గర హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేశాం. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావటంతో ఆ రోజుల్లో దరఖాస్తులు స్వీకరించరు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


విజేతలను ప్రకటిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీని సద్వినియోగం చేసుకోని, ఆర్టీసీ బస్సులలో ప్రయాణాలు సా గించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. దసరా పండుగ నేపథ్యంలో, ప్రయాణీకులను ఆకర్షించేందుకు ప్రయాణీకుల ఆదరణను పెంచుకోవడానికి తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ప్రకటించిన లక్కీ డ్రా ను, ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజియన్ పరిధిలో బుధవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో ప్రయాణీకుల సమక్షంలో నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చేతుల మీదు గా లక్కీ డ్రా ను నిర్వహించి విజేతలను ప్రకటించారు. విజేతలకు సంస్థ హైదరాబాదులో నిర్వహించబోయే కార్యక్రమంలో విజేతలందరికీ నగదు బహుమతులను ప్రధానం చేయనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీ.వి.మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్, శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కోటాజీ, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. బుధవారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 2.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామని ఈ ఏడాది 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా సహకార అధికారి గంగాధర్ , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు, సెంటర్ ఇన్చార్జిలు ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

పాత నేరస్థుడు మహేష్ అరెస్టు

ఖమ్మం క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధమైన కార్యకలాపాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీషీటర్ జెకే.మహేష్ తో పాటు మరో నిందుతుడు రబ్బానీను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఖానాపూరం హావేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందుతుడు మహేష్ వరుస నేరాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో నిందితుడి నేర ప్రవృతిని శాశ్వతంగా చెక్ పెట్టడానికి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు టౌన్ ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో ఇటీవల గాంధీ జయంతి రోజున నగరంలోని శ్రీనగర్ ప్రాంతంలో ఇద్దరు రౌడీ షీటర్లు దాడులకు తెగపడిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఫోర్డ్ ఇండీవర్ కారు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులతో వెళ్తున్న ఆటో పల్టీ

ఖమ్మం క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో పల్టీ కొట్టిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్ రూమ్ నుంచి రోటరీ నగర్ లోని ప్రభుత్వ పాఠశాలకు కొంతమంది విద్యార్థులు ఆటోలు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇందిరానగర్ రోడ్డు వద్దకు రాగానే ఓ ద్విచక్రవాహనం ఎదురు రావడంతో దాన్ని ఢీ కొట్టి ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న విద్యార్థులు గాయాలు అవ్వడంతో సానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పాత్రధారులపై వేటు..
త్వరలో సూత్రధారిపై!

(5వ పేజీ తరువాయి)

సస్పెన్షన్ వేటు వేశారు. కాగా బుధవారం వరంగల్ అటవీ శాఖ ప్రాంతీయ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ దరావత్ భీమానాయక్ చింతకాని సెక్షన్ ఆఫీసర్ కవితను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇటీవల ఆంధ్రజ్యోతిలో తోడేళ్లను వదిలి.. కుందేళ్లపై వేటు' శీర్షికన ప్రచురితమైన కథనం సీఎం కార్యాలయం వరకు వెళ్లింది. దీంతో లోతుగా శాఖా పరమైన విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రాష్ట్ర అటవీశాఖ ప్రిన్స్‌పల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారె స్టు అధికారులకు ఆదేశాలు రావడంతో మంగళవారం వరంగల్ అటవీ విభాగం చీఫ్ కన్జర్వేటర్ ఖమ్మంలో విచారణ నిర్వహించారు. విచారణ జరిగిన మరుసటి రోజు సెక్షన్ ఆఫీసర్‌పై వేటు పడింది. కా గా మరి కొందరిపై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

45కు పెరిగిన అక్రమ పర్మిట్ల సంఖ్య

అటవీశాఖ రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్వో ఖమ్మంలోనే ఉండి విచారణ కొనసాగిస్తున్నారు. మొత్తం 1,400 పర్మిట్లను వరసగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వరకు 26 అక్రమ పర్మిట్లు ఉన్నట్లు గుర్తించగా బుధవారం ఆ సంఖ్య 45కు పెరిగిందని సమాచారం. ఇంకా అక్రమ పర్మిట్లు బయటపడే అవకాశం ఉందని, దీంతో లోపాయికారిగా సహకరించిన అటవీశాఖ అధికారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో క్రమశిక్షణ చర్యల నుంచి తప్పించుకునేందుకు సెంటిమెంట్, ఇతర అస్త్రాలను వాడుతున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి.

శ్రీరామ.. బిల్లుల చెల్లింపులు మరిచారు

తీరు మారని రెవెన్యూ అధికారులు

నవమి అయిపోయి ఆరు నెలలు గడిచినా.. లభించని మోక్షం



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

భద్రాచలం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సమయంలో వీవీఐపీ, వీఐపీలకు భోజన, వసతి సదుపాయాలు కల్పించినందుకు గాను పట్టణంలోని పలు లాడ్జీలకు, హోటల్‌కు చెల్లించాల్సిన బిల్లులు రెవెన్యూ అధికారులు మరిచారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని సుమారు 68 లాడ్జీలు రెవెన్యూశాఖ పరిధిలోకి తీసుకోగా.. ఆ రెండు రోజుల పాటు వినియోగించుకున్న వారి నుంచి వసూలు చేసిన అద్దెలను తిరిగి చెల్లించాల్సి ఉన్నా నేటికీ చెల్లించలేదని సమాచారం. ఆ సమయంలో ఎన్ని లాడ్జీల్లోని గదులు భక్తులు వినియోగించుకున్నారు.. ఎంత మొత్తం రావాలి అనే దానిపై ఎటువంటి వివరాలు నేటి వరకూ సంబంధిత లాడ్జీల నిర్వాహకులకు అందలేదని ప్రచారం సాగుతోంది. అలాగే వచ్చిన ముఖ్య అతిధులకు వారి భద్రత సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేయగా వాటికి సంబంధించిన సుమారు రూ.60 వేలకు పైనే బిల్లులు రావల్సి ఉన్నట్లు తెలుస్తోంది. చివరకు నవమి సమయంలో గోదావరినదీ తీరంలో రక్షణగా గజ ఈతగాళ్లు 20 మందిని ఏర్పాటు చేయగా వారికి రోజుకు ఒక్కరికి రూ.800 చొప్పున చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా మూడు రోజుల పాటు వారికి చెల్లించాల్సిన మొత్తంపై సైతం కూడా నేటి వరకు ఎటువంటి స్పష్టత మత్స్య, రెవెన్యూ శాఖ అధికారుల నుంచి లేదని గజ ఈతగాళ్లు వాపోతున్నారు. ఈ విధంగా శ్రీరామ నవమి, ముక్కోటి, గోదావరి వరదల సమయంలో చెల్లింపుల్లో ఎడతెగని జాప్యం జరుగుతున్నా ఉన్నతాధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం పట్ల వ్యాపార వర్గాలు, గజ ఈతగాళ్ల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్ల క్రితం చెల్లింపులకు దిక్కులేదు?

2022 గోదావరి మహా వరదల సమయంలో గజ ఈతగాళ్లకు డబ్బులు వెంటనే చెల్లిస్తామంటూ అప్పటి ప్రభుత్వం నమ్మబలికి వారిని విధుల్లోకి తీసుకుంది. ఈ విధంగా ఒక్కొక్క గజ ఈతగానికి 32 మస్టర్లు ఇవ్వాల్సి ఉందని 35 మందికి పైగా రేయింబవళ్లు కష్టపడ్డా వారికి చెల్లింపులు చేస్తామని నాడు హామీ ఇచ్చిన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి సైతం అనంతరం ఆ విషయమే మరిచారని గజ ఈతగాళ్లు వాపోతున్నారు. తమకు రూ.11 లక్షల వరకు రావాల్సి ఉండగా కేవలం రూ.5 లక్షలు చెల్లించి మిగిలిన మొత్తం నేటికీ చెల్లించలేదని వారు ఆరోపిస్తున్నారు.

వినాయక నిమజ్జనం చెల్లింపులు అంతే

ఇటీవల వినాయక నిమజ్జనం గోదావరిలో నిర్వహించిన సమయంలో దసరా ముందే చెల్లింపులు చేస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారని వాటికీ ఇప్పటివరకు చెల్లింపులు లేవని గజఈతగాళ్లు వాపోతున్నారు. రోజుకు మూడు షిఫ్టుల పద్దతిన ఎనిమిది రోజుల పాటు 40 మంది గజ ఈతగాళ్లు పని చేశారని అలాగే 15 బోట్లు, రెండు లాంచీలను సైతం వినియోగించారని వాటికి చెల్లించాల్సిన మొత్తాలపై ఇప్పటి వరకు మత్స్య, రెవెన్యూ శాఖ అధికారులు ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కష్టపడి పని చేసిన తమకు తమ కష్టార్జితాన్ని వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 'ఈఎస్ఐ' మెరుగైన వైద్య సేవలు

జనరల్ మేనేజర్ పర్సనల్ కవితానాయుడు



రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ పర్సనల్ కవితానాయుడు

కొత్తగూడెం టౌన్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ పథకం అమలు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు సింగరేణి జనరల్ మేనేజర్ పర్సనల్ కవితానాయుడు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఈఎస్ఐ పథకం అమలు కోసం ప్రధాన కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాలో ఈఎస్ఐ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈఎస్ఐ పథకం సభ్యత్వం పొందుటకు కాంట్రాక్ట్ ఉద్యోగులకు నెలకు రూ.21 వేలు వేతనం ఉండాలని తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలతో పాటు బీమా సౌకర్యం సైతం కల్పిస్తున్నట్లు తెలిపారు. నాన్ మైనింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రకటించారు. సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వైద్యసదుపాయాలను అందించాలని, ఈ పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని కాంట్రాక్ట్ ఉద్యోగులతా సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అజయ్‌కుమార్, డీజీఎం వరప్రసాద్, మోహన్‌రావు, ఖమ్మం ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ సాయికుమార్, డీవైపీఎం చక్రవర్తి, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పద్ధతులు ఉపయోగించి వ్యవసా యం చేయాలని మోజెర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని అచ్యుతాపురంలో బుధవారం సాయంత్రం శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మోజెర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్సీరియన్స్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సులో రైతులు వాడే వివిధ రకాల రసాయనాలు, వాటిపై ఉండే గుర్తులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రసాయన ఎరువుల వాడ కం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచుకోవటం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ఉద్యాన పంటల సాగులో మెళకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సత్యసాగర్, శివ, నేతాజీ, అభినవ్, అజయ్, యశ్వంత్ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం స్వాధీనం



వైరా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరాలో అ క్రమంగా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా ఆరో వార్డులో రేచర్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన మరో మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.

ఏఐ ప్రోగ్రామింగ్ టాపర్.. పల్లవికి మంత్రి తుమ్మల అభినందన



పల్లవితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి, కృషి పట్టుదలతో చదివి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్‌ఇండియా టాపర్‌గా నిలిచిన తాళ్లూరి పల్లవిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన పల్లవిని సత్కరించారు. కష్టాలు ఎదురైనా కుమార్తెను చదివించిన ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. పల్లవిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఓ సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన పల్లవి ఏఐ ప్రోగ్రామింగ్‌లో ఆల్ ఇండియా టాపర్‌గా నిలవడం సాధారణ విషయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, వీవీ పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఖమ్మాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా..

ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు కృషి : మంత్రి తుమ్మల

18వ డివిజన్‌లో రోడ్ల పనులకు శంకుస్థాపన

ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం నగరాన్ని రాష్ట్రంలోనే సుందరంగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని 18వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాన చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ ఖమ్మంలో జరిగే అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. మురికి కాలువల పక్కన ఉండే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, పెరుగుతున్న జనాభకు అనుగుణంగా పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ఖమ్మం నగరంలో ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉంటుందని, ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. యూరియా వాడకం వల్ల క్యాన్సర్ మహమ్మారి ప్రబలుతుందని అందువల్ల తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల సహకారంతో ఖమ్మం అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని, పనులు కూడా నాణ్యతగా నిర్వహించి నగరాన్ని సుందరంగా ఉంచుకుంటామన్నారు. స్థానిక ప్రజలు కూడా ఇందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మందడపు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుతో 'బెస్ట్ అవైలబుల్' భూస్థాపితం!

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): నిధులు విడుదల చేయ కుండా బెస్ట్ అవైలబుల్ స్కీంను భూస్థాపితం చేసేలా కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని, పలకా బలపం పట్టి పాఠశాలల్లో ఉండాల్సిన చిన్నారులను రోడ్డున పడేసిన ఘనత రేవంత్‌రెడ్డిదే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎనుగుల రాకేష్‌రెడ్డి దుయ్యబట్టారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వమే బజారున పడేసిందని, అండ గా ఉండాల్సిన ప్రభుత్వమే ఆగంచేసిందని ఆరోపించారు. భట్టి విక్రమార్క ఆర్థికశాఖ మంత్రి కాదని, వాయిదాల మంత్రిగా, వాటాల మంత్రిగా ఘనత సాధిస్తున్నారని ఆరోపించారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్, 2000 ప్రభుత్వ పాఠశాలల మూసివేత, గ్రూపు-1లో గోల్‌మాల్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు నిధులు కేటాయించకపోకడం, పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇవి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా 23 నెలల్లో సాధించిన ఘనత అని ఆయన ఎద్దేవచేశారు. 55 సార్లు రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరగడానికి, హెలికాప్టర్లలో తిరగడానికి, మంత్రులు జల్సాలు చేయడానికి డబ్బులున్నాయి.. కానీ విద్యార్థులకు కేటాయించేందుకు నిధులు లేవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తెచ్చిన ఏ పథకాన్ని రేవంత్‌రెడ్డి సక్రమంగా నడవనివ్వడం లేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అప్పటివరకు కేవలం 80 పాఠశాలల్లో మాత్రమే బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ స్కీమ్ ఉంటే.. వాటిని సుమారు 200కు పెంచారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్, తొగరు రాజశేఖర్, కర్నే మురళి, పూల రవీందర్, మునీర్, పోతురాజు, రవి, భూపతి శ్రీను, జయరాజ్, రమేష్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదిగొండ మండలం, ఖానాపురం గ్రామానికి చెందిన యువతి రమ్య, ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ సలీం గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద కలిసేవాళ్లు. పెళ్లి చేసుకుంటానని చెప్పి రమ్యను కాకుండా మరో మహిళను సలీం పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై తనను ప్రేమించి పెళ్లికి నిరాకరించాడని అతనిపై బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుడిపాటి పవన్(23) ఈనెల 4న కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి గుడిపాటి యశోద బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడౌన్లలో బాణసంచా అక్రమ నిల్వ

రూ.10 లక్షల టపాసులు స్వాధీనం

అనుమతి లేకుండా నిల్వ ఉంచితే కఠిన చర్యలు



పట్టుబడిన బాణసంచా

భద్రాచలం,, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా భద్రాచలంలోని పలు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన రూ.10 లక్షల విలువైన దీపావలి టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా, గ్యాస్ గోడౌన్ ఏరియాలో జనావాసాల ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు ఉమ్మడిగా ఈ దాడులు నిర్వహించగా టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, రామకృష్ణలు పాల్గొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా దీపావళి టపాసులు నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు తెలిపారు. జనావాస ప్రాంతాల్లో బాణసంచా నిల్వ ఉంచడం వలన అమాయకుల ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఈ క్రమంలో ప్రజాహితార్థం అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ద్విచక్ర వాహనదారుడిపై కోతుల దాడి

తండ్రీ కొడుకులకు గాయాలు



క్షతగాత్రునికి చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

చింతకాని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రీ కొడుకులపై కోతులు దాడి చేయడంతో గాయపడిన ఘటన బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామం వద్ద ఖమ్మం-బోనకల్ రోడ్డుపై చోటు చేసుకుంది. చిన్న మండవ గ్రామానికి చెందిన పర్సగాని నాగేశ్వరరావు అతని కుమారుడిని దసరా సెలవులు అనంతరం పాఠశాలలో చేర్పించేందుకు ఖమ్మంలోని బీసీ బాలుర వసతి గృహానికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా పందిళ్లపల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేయబోయా యి. వాటినుంచి తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనం కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్రవాహనం వెనుకు కూర్చున అతని కు మారుడు రాంప్రసాద్ కాలుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అం దుకున్న 108సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమి క చికిత్స అందించి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

200 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు... పరారీలో ఇద్దరు

నేలకొండపల్లి, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నేలకొండపల్లి పోలీసులు బుధవారం ఓ వ్యక్తి నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం బుధవారం ఉదయం 9గంటల సమయంలో నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ తన సిబ్బందితో కూసుమంచి రోడ్డులో వెళుతుండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు కనపడటంతో, పోలీసులు వారిని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన వారిని పట్టుకోవటానికి ప్రయత్నించగా ఓవ్యక్తితో పాటుగా టీఎస్10ఎఫ్ఏ9153 నెంబరు గల ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి సూర్యాపేట జిల్లా మోతె మండలం గోల్‌తండాకు చెందిన గుగులోతు మనోజ్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారిని మోతె మండలానికే చెందిన మరకచర్లకు చెందిన బన్ను, నవీన్‌గా గుర్తించారు. వీరిపై గతంలో కూడా గంజాయి కేసులున్నట్లు ఎస్ఐ సంతోష్ చెప్పారు. పరారైన వారి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ చెప్పారు. నిందితుడు మనోజ్‌ను రిమాండ్ నిమిత్తం బుధవారం కోర్టుకు తరలించారు.

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

▸▸కలెక్టర్ జితేష్ వి పాటిల్ ▸▸ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశ్‌నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం పరిశీలించారు. కేంద్రంలోని చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ తీరుతెన్నులు, ఆరోగ్య పర్యవేక్షణ, కార్యకర్తలు, సహాయకుల పనితీరు, పూర్వ ప్రాథమిక విద్యా బోధన అమలు విధానాలు, అంగన్వాడీ కేంద్రం పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించి నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి చిన్నారులకు నిర్ణీత సమయానికి పోషక ఆహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహార పదార్థాల పంపిణీ తీరుతెన్నులపై ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడీ కేంద్రం బాలల సమగ్రాభివృద్ధికి కేంద్ర బిందువుగా మారాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచరు శాంతి ఆశాపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధచూపండి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ పరిధిలోని ప్లాంటేషన్‌లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి నిలపాలని చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ భీమా నాయక్ సూచించారు. అశ్వారావుపేట రేంజ్‌లో బుధవారం సీసీఎఫ్ పర్యటించారు. మండలంలోని ఊట్లపల్లి సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలోని 50 ఎకరాల ప్లాంటేషన్‌ను పరిశీలించారు.మొక్కల పెరుగుదలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొక్కలను జాగ్రత్తగా పెంచాలని, ప్లాంటేషన్ రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అశ్వారావుపేటలో నూతనంగా నిర్మిస్తున్న అటవీశాఖ అతిథిగృహ నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాన్ని పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఎఫ్‌డీవో దామోదరెడ్డి, రేంజర్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ స్కానింగ్ సెంటర్‌పై వైద్యాధికారుల దాడి

స్కానింగ్ మిషన్ స్వాధీనం ● ఇద్దరిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంట్లో అక్రమంగా నిల్వఉంచి స్కానింగ్ చేస్తున్నారనే సమాచారంతో జిల్లా వైద్యశాఖ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. స్కానింగ్‌కు ఉపయోగించే అల్ట్రాస్కానింగ్ మిషన్‌ను, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం అర్బన్ మండలంలో వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెంబర్ 4, ఇంటినెంబరు 4/3లో ఇద్దరు వ్యక్తులు పాండురంగాపురంకు చెందిన సల్లోజ వెంకటేష్, ఖమ్మం రూరల్‌కు చెందిన బనోత్ హుస్సేన్ ఇక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని పోర్టబుల్ అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రంతో మహిళలకు స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు తేలింది. దీంతో ఆ ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారిపై పీసీపీఎన్డీటీ చట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అల్ట్రా స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి కళావతీబాయి తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో ,జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ (పీసీఎన్డీటీ చట్టం),డాక్టర్ చందు నాయక్, ఖమ్మం అర్బన్ పోలీసులు దాడుల్లో పాల్గొన్నారు. పీసీపీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారాన్ని అందించాలని ఆమె జిల్లా ప్రజలను కోరారు.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎల్లప్పుడూ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శ్రీధర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోన్నేకల్లు పరిధిలో గల శ్రీచైతన్య కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం నిర్వహించిన రెండు వారాల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీ విద్య, డైరెక్టర్ సాయి గీతిక, ప్రిన్సిపల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్. రాజేష్, డాక్టర్ సుదర్శన్, సీహెచ్ కృష్ణ ప్రసాద్, చిరంజీవి, ప్రణతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

▸ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న పిల్లలకు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఇతర ప్రభుత్వ డాక్యుమెంట్లను నిబంధనల ప్రకారం ఫాలో అప్ చేస్తూ రాబోయే 15 రోజులలో పూర్తి స్థాయిలో జారీ చేయాలని ఆదేశించారు. గత 3 నెలలకు సంబంధించి ఆర్‌బీఎస్కే పని తీరుపై రిపోర్ట్ అందించాలన్నారు. పోక్సో కేసుల నమోదు, వాటిపై తీసుకున్న చర్యలు కలెక్టర్ తెలుసుకున్నారు. పోక్సో చట్టం ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూవో కె. రాంగోపాల్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన, సీడీపీవోలు పాల్గొన్నారు.

సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు సురక్షితంగా, ఆనందంగా దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, దీపావళీ పండుగకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. పోలీస్, మునిసిపల్, రెవిన్యూ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు.ఎస్సార్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానంలో టపాసుల షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు అనుమతుల మంజూరులో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ ప్రసాద రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, కళాశాల ప్రిన్సిపాల్ షఫీయుల్లా, జిల్లా అగ్నిమాపక అధికారి బి. అజయ్ కుమార్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చందునాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్‌కుమార్, మధిర, వైరా, సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమాజంలో వైద్యవృత్తి గౌరవప్రదమైంది

▸ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని.. దీన్ని ఎంచుకున్న మీరంతా భవిష్యత్‌లో మంచి వైద్యులుగా సేవలు అందించాలని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ అన్నారు. బుధవారం మెడికల్ కళాశాలలో మెదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఓరియంటేషన్ తరగతుల సందర్భంగా విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అకుంఠిత దీక్షతో ఇష్టంగా చదివితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఈ సందర్భంగా మెడికల్ విద్యార్థులకు వివిధ విభాగాల అధిపతులు ఉపోద్ఘాతాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడోత్సవం



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కమాన్‌బజార్ శ్రీస్తంభాద్రి వెంకటేశ్వర స్వామి 61వ వార్షిక కళ్యాణోత్సవంలో బాగంగా బుధవారం స్వామి వారి గరుడోత్సవము ఘనంగా నిర్వహించారు. ఉదయం బిందె తీర్థం, ప్రాతరాధన, హవనము, తదితర ప్ర త్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం స్వామి వారి గరుడోత్సవము కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈవో వేణుగోపాలాచార్యులు తెలిపారు.

నేటి నుంచి పర్ణశాల వద్ద బస్‌స్టాప్



బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్ఎం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల వద్ద నేడు గురువారం నుంచి బస్ స్టాప్ ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రజలు, ప్రయాణికులు గమనించి సహకరించాలని రీజనల్ మేనేజర్ సరిరాం కోరారు. బుధవారం ఖమ్మం ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ నాయుడుతో కలిసి ఇప్పటివరకు ఉన్న ఇందిరానగర్ బస్ స్టాప్‌ను కొంచెం ముందుకు ఉన్న పర్ణశాల రామాలయం వద్దకు మార్చుటకు పరిశీలించి రేపటి గురువారం నుంచి బస్సులన్నీ పర్ణశాల వద్దనే ఆగుతాయని, దీనికి ప్రజలు, ప్రయాణికులు సహకరించి పర్ణశాల స్టాప్ వద్దకు రాగలరని కోరారు. వైరా తల్లాడ భద్రాచలం, సత్తుపల్లి వెళ్లే మార్గంలో మమత రోడ్డు దగ్గర ఉన్న ఇందిరానగర్ బస్ స్టాఫ్‌లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్న కారణంగా, మూడు రోడ్ల కూడలి వల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం సరిరాం, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఇందిరానగర్ బస్ స్టాప్ లోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్ స్టాప్‌ను మార్చడం జరిగిందని తెలిపారు.

సార్ రాకుంటే అంతే..

▸ సమయం పాటించని కేఎంసీ ఉద్యోగులు

▸ ఉద్యోగుల ఛాంబర్ల వద్ద గంటల తరబడి నిరీక్షించిన ప్రజలు



మధ్యాహ్న సమయంలో ఖాళీగా ఉన్న మెప్మా విభాగం

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పగ్గం చాటైతే పారిపోయే విదంగా పనిచేస్తున్నారు ఖమ్మం నగర పాలక సంస్థలోని కొన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు. ముఖ్యంగా కమిషనర్ కార్యాలయానికి రాకుంటే చాలా విభాగాల ఉద్యోగులు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి రావడం లేదు. నిబంధనల మేరకు విధులకు హాజరయ్యే ఉద్యోగులు వారి వెంట లంచ్ బాక్స్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. జిల్లా సమీకృత కార్యాలయం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే విధానం కొనసాగుతోంది. కాని కేఎంసీ అధికారుల ఉదాసినత కారణంగా ఉద్యోగులు కనీస సమయ పాలన పాటించడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. అయితే బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ హైదరాబాద్ సమావేశానికి వెళ్లారు. కేఎంసీ కార్యాలయంలోని ఓ ఉద్యోగి సమీప బంధువు ఫంక్షన్ ఖమ్మం రూరల్ మండలంలోని ఓ దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఇంకే ముంది ఉదయం విధులకు హాజరైన కొంతమంది ఉద్యోగులు ఫంక్షన్‌కు వెళ్లి సాయంత్రం 3.30 వరకు హాజరు కాలేదని విమర్శలు వెలువడ్డాయి. ఆ విభాగంలో పని కోసం వచ్చిన వీధి వ్యాపారులు గంటల తరబడి నిరీక్షించారు. ఇక కార్యాలయంలోని ఇంకొంత మంది ఉద్యోగులు తమ విభాగాలు, ఛాంబర్లు వదిలి పెట్టి పక్క విభాగాలకు వెళ్లి ముచ్చట్లు పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేఎంసీ కార్యాలయంలోని ఉద్యోగుల పని గంటల సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.



ఛాంబర్ వద్ద వేచి ఉన్న వీధి వ్యాపారులు

ప్లాస్టిక్ రహిత ఖమ్మమే లక్ష్యం

▸ మేయర్ పునుకొల్లు నీరజ



జవాన్లకు జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం పరిశుభ్రంగా ఉండటానికి పారిశుధ్య కార్మికుల నుంచి జవాన్లు వరకు విశేషంగా పనిచేస్తున్నారని, ప్లాస్టిక్ రహిత ఖమ్మంగా ఖ్యాతీ పొందటానికి జవాన్లు కీలకంగా పని చేయాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం మేయర్ సమావేశ మందిరంలో జవాన్లుతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరంలో ఇంకా పారిశుధ్యం మెరుగు పడాలని సూచించారు. జవాన్ల సమస్యలు తెలుసుకున్నారు. కష్టపడే వారికి ఖమ్మం నగర పాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్లాస్టిక్ అమ్మకాలు జరిపే వారిపై కఠినంగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులను నిర్వహించాలి

▸ జిల్లా సహకార, ఎన్నికల వ్యయ నోడల్ అధికారి గంగాధర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా సహకార అధికారి గంగాధర్ అన్నారు. బుధవారం డీపీఆర్సీ భవనంలో జోనల్ అధికారులు, అకౌంటింగ్ బృందాలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీఎస్ బృందాలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన మేర ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, అక్రమ నగదు బంగారం, ఇతర ముఖ్యమైన ఆభరణాలు, ఉచితాల పంపిణీని అరికట్టేందుకు ఈ బృందాలు కట్టుదిట్టంగా పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఉల్లంఘణలు, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలన్నారు. ఎన్నికల వ్యయ వివరాల నమోదు ఒక అంశమైతే, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు మరో ఎత్తుగా ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. శిక్షణలో జిల్లా ఆడిట్ అధికారి భూక్యా హసేన్ నాయక్, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, నిఘా బృందాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగాధర్



శిక్షణకు హాజరైన అధికారులు

ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బీజేపీ

▸ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్



సమావేశంలో మాట్లాడుతున్న జావీద్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగం కల్పించిన లౌకికతత్వాన్ని కాపాడేందుకు బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లాలని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ జావీద్ కోరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఖమ్మంలోని 60 డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా ఓట్ చోర్ గద్దె చోడ్ నినాదంతో ప్రతి డివిజన్ నుంచి 100 సంతకాలు సేకరణ జరపాలని కోరారు. ఒక వ్యక్తికి ఒక ఓటు అనేది రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకు కల్పించిన హక్కుగా పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలు కూడా బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు.రబ్బాని, గౌస్, అబ్బాస్, యశ్వంత్, రమేశ్, శ్రీనివాస్, కనక రాజు, పూర్ణచంద్, మహమూద్, వెంకటయ్య, సుగుణ, కృష్ణ, రవి, రాజీ, ప్రవీణ్ తదితరులున్నారు.

రామ శ్రీనుకు మాతృవియోగం

● పలువురు నాయకుల సంతాపం



కూసుమంచి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ నాయకులు మునిగేపల్లి గ్రామానికి చెందిన రామశ్రీను తల్లి కళావతి(70) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈసందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అరించారు. ఆమె కుమారుడు రామశ్రీనును ఓదార్చారు. కూసుమంచి మండల ఇన్‌చార్జ్ భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు హఫీజుద్దీన్, మాజీ ఎంపీపీ బాణోతు శ్రీను, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, టీడీపీ జిల్లా కార్యదర్శి కొండబాల కరుణాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు మందపల్లి కోటి, రామ వీరబద్రం, గుగ్గిళ్ల మోహన్ తదితరులున్నారు.


అయ్యప్పలకు అన్నదానం



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వయంభు శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి నవంబరు 18 వరకు ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు(మాలధారణ) 41 రోజుల పాటు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించామని సుమారు 500లకు పైగా స్వాములు అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండల్‌రావు, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లవిని సన్మానించిన బీబీఎం యాజమాన్యం

ఖమ్మం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ అవార్డు అందుకున్న బీబీఎం పాఠశాల పూర్వ విద్యార్థిని తాళ్లూరి పల్లవిని పెద్దతండాలోని భారత్ బాలమందిర్ (బీబీఎం) పాఠశాల యాజమాన్యం బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జి. కాంతారావు మాట్లాడుతూ ఆరెంపుల గ్రామానికి చెందిన తాళ్లూరి పల్లవి ఒకటో తరగతి నుంచి 10 తరగతి వరకు బీబీఎం పాఠశాలలోనే చదువుకుందని తెలిపారు. పల్లవి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగంలో జాతీయ స్థాయిలో అవార్డు స్వీకరించడం అభినందనీయమన్నారు. పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులు రవి, అజితాలను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగమణి, ప్రధానోపాధ్యాయులు గోపాలరావు పాల్గొన్నారు.



పల్లవిని సన్మానిస్తున్న బీబీఎం యాజమాన్యం

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

▸ ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఉద్ఘాటించారు. బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 22 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసహనం వచ్చిందని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బషీరుద్దీన్

తిరుమలాయపాలెం, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టే విధగా యువత ఉద్యమాలకు రావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో డీవైఎఫ్ఐ పాలేరు డివిజన్ 13వ మహాసభలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను తప్పుదారి పట్టిస్తూ మతోన్మాద రాజకీయాల నడిపిస్తుందన్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు బౌద్ధులపైనా రెచ్చగొట్టేలా యువతను ప్రేరేపిస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువశక్తిని నిర్వీర్యంచేస్తున్నాయని ఆరోపించారు. నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డుమధు, నవీన్, రాజశేఖర్, నరేష్, వనజ, రమేష్, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రాదేశిక.. నోటిఫికేషన్ నేడే

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలవుతున్నందున తొలివిడత నామినేషన్ల దాఖలు శుక్ర, శని వారాల్లో ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. తొలిరోజైన గురువారమే కొందరు నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలున్నాయి. ఇక ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది. అయితే హైకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందోనని అటు పార్టీలు, ఇటు ఆశావహులను ఆందోళన చెందుతున్నారు. పైకి ఎన్నికలకు సన్నద్ధమవుతున్నా కోర్టు నిర్ణయంపైనే ఎన్నికల తంతు ముడిపడి ఉందని, ఏదేమైనా నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధంగా ఉండాలంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ వామపక్షాలు, బీజేపీల నేతలు తమ కేడర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల వేళ తమకు అనుకూలంగా ఉండే పార్టీలో చేరేందుకు స్థానిక నేతలు ఆసక్తి చూపుతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేశాం

● వీసీలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు వివరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే 149 ఎంపీటీసీ, 10జడ్పీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని బుధవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం ఖమ్మం నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వీసీకి హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ, ఎలక్టోరల్ ప్రదర్శన, నామినేషన్ కేంద్రాల వద్ద 100మీటర్ల పరిధి స్పష్టంగా తెలిసేలా మార్కింగ్, బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో వాల్ క్లాక్ ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో తీయాలని, రిటర్నింగ్ అధికారి సీరియల్ నెంబర్ వారీగా నామినేషన్లను నమోదు చేయాలన్నారు. రోజు ఎన్ని నామినేషన్లు దాఖలు అవుతున్నాయో స్పష్టంగా వివరాలు నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షరైనా, డీఆర్డీవో సన్యాసయ్య. డీపీవో ఆశాలత, డీఎల్పీవో విజయలక్ష్మి, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.


బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): బీసీల వెనుకబాటుతనానికి రాజకీయపార్టీలే కారణమని , మేమెంతో మాకంత అనే నినాదంతో బీసీలు పోరాటాలకు సిద్ధంకావాలని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు కనీసం 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. తద్వారా బీసీల తలరాతలు మారుతాయన్నారు. దీనికి ఏపార్టీ అడ్డుకున్నా వారు బీసీ ద్రోహులుగా మిగిలి పోతారన్నారు. నేడు బీసీ రిజర్వేషన్ల తీర్పు నేపథ్యంలో ఖమ్మంలో పెద్దసంఖ్యలో బీసీలు తరలిరావాలన్నారు.

ఈసమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో కల్చరల్ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎస్‌బీఐటీ కళాశాలలో ఓటీటీ ప్లాట్ఫామ్ ఆహా ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ఇండియన్ ఐడల్ కార్యక్రమంలో గాయకులు అద్భుతమైన సంగిత ప్రదర్శన ఇచ్చారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు తమ కఠినమైన అకాడమిక్స్ నుంచిరిలాక్స్ అవడానికి చాలా ఉపయోగపడతాయి అన్నారు. పోటీదారులైన ధీరజ్, బృందా, పవన్ కళ్యాణ్, దర్శన్ నారాయణ పాటలను ఆలపించి విద్యార్థుల మనసులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, శివ ప్రసాద్, రవీంద్రబాబు, పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయకులు

బీసీలు పోరాటానికి సిద్ధంకావాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీల వెనుకబాటుతనానికి రాజకీయ పార్టీలే కారణమని, తామెంతో తమకంతా అనే నినాదంతో బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు కనీసం 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. తద్వారా బీసీల తలరాతలు మారుతాయన్నారు. దీనికి ఏ పార్టీ అడ్డుకున్నా వారు బీసీ ద్రోహులుగా మిగిలి పోతారన్నారు. నేడు బీసీ రిజర్వేషన్ల తీర్పు నేపథ్యంలో ఖమ్మంలో పెద్దసంఖ్యలో బీసీలు తరలిరావాలన్నారు.

ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేయాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మధిర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేయాలని మండల అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం మధిరలోని రిక్రియేషన్ క్లబ్ కళ్యాణమండపంలో మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల తొలివిడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని శిక్షణ పొందుతున్న అధికారులకు తగు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ లో ఎటువంటి తప్పులు జరగకుండ జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండ వద్దని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఈవీఎం పద్దతిలో జరిగితే స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పద్దతిలో జరుగుతాయని అధికారులు తమకు ఉన్న చిన్న అనుమానాన్ని శిక్షణలో నివృత్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో పోలీస్ ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికలు స్వేచ్ఛా వాతావరణంలో జరిగేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.శ్రీజ, అదనపు పోలీస్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పి.డి సన్యాసయ్య, ఆర్డీఓ నరసింహారావు, మధిర, ఎర్రుపాలెం తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, ఉషాశారద, మధిర రూరల్ సిఐ మధు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.



కల్లూరు: కల్లూరులోని రైతు వేదిక కేంద్రంలో బుధవారం స్థానిక ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై పిఓ, ఏపిఓలకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక శిక్షకులైన అధికారులు పుష్పలత, సుదర్శన్ లు ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రత్యేక శిక్షకులు సమగ్ర అవగాహన కల్పించారు.



సత్తుపల్లిలో శిక్షణకు హాజరైన అధికారులు

ఎన్నికల నిబంధనలను పాటించాలి

సత్తుపల్లిరూరల్: ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎంపీడీవో నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జేవీఆర్ కళాశాలలో గ్రామపంచాయితీ, మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశిక ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో కృష్ణ, మండల, మునిసిపల్ అధికారులు, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వేంసూరు: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలకు బుధవారం వేంసూరు రైతువేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజారావు మాట్లాడుతూ.. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

ముదిగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేక అధికారి మహేష్ సూచించారు. బుధవారం ముదిగొండ రైతు వేదికలో పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల నియామవళిని పాటిస్తూ విధులను పారదర్శకంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, ఎంపీవో కిషోర్ పాల్గొన్నారు.

కౌటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి కళాశలలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు సూచించారు. వైరా సీఐ ఎన్.సాగర్, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.



మధిరలో..



కల్లూరులో శిక్షణకు విచ్చేసిన పీవో, ఏపీవోలు



వేంసూరులో..



తల్లాడ కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారితో మాట్లాడుతున్న కలెక్టర్

అధ్వానంగా అంతర్గత రహదారులు

ఏన్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఏన్కూరులో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. 11వ వార్డు, పాతచెక్‌పోస్టు సమీపంలోని రోడ్డు మురికి కూపంగా మారింది. మోకాలిలోతు బురదతో నడవడానికి కూడా వీలులేకుండా ఉంది. రోడ్డుకి ఇరువైపులా చెట్లుపెరిగి రోడ్డు మూసుకుపోయింది. ఈ విషయమై స్థానికులు సంబంధిత అధికారులకు విన్నవించిన ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేయాలని కాలనీవాసులు కోరుతన్నారు.



అధ్వానంగా ఉన్న పాత చెక్‌పోస్టు బజార్ రోడ్డు

నిస్వార్థంగా పనిచేసే నాయకులను గెలిపించుకుందాం

» సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిస్వార్థంగా పనిచేసే ప్రజాప్రతినిధులను గెలిపించుకుందామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని సత్యంపేటలో నిర్వహించిన ఎన్నికల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెత్తందారులకు అవకాశాలు ఇవ్వవద్దని, ప్రజలతో అంటి పెట్టుకుని ఉండేవారికే అవకాశాలలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏ.వెంకన్న, గంటా శ్రీను, లాజరు, ఏ.శరత్, వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, రాఘవులు, నాగ ప్రసాద్, తాటి దేవి తదితరులు పాల్గొన్నారు.



సత్యంపేటలో మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరావు

పార్టీ బలపరిచే అభ్యర్థులు వీరే..

సత్తుపల్లి జడ్పీటీసీ అభ్యర్థిగా తాటి దేవి, రుద్రాక్షపల్లి ఎంపీటీసీగా ఒగ్గు నాగిరెడ్డి, సర్పంచ్‌గా గంటా శ్రీను, కాకర్లపల్లి ఎంపీటీసీ బొజ్జా విశ్వనాధం, సర్పంచ్‌గా నడికుదురు భాస్కరరావులను అభ్యర్థులుగా పోటీలో పెడుతున్నామని, మిగతా అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

ముగిసిన వన్యప్రాణి సప్తాహ వారోత్సవాలు

» వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత: రేంజర్ స్నేహలత

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వన్యప్రాణి సప్తాహంలో భాగంగా సత్తుపల్లి అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో తెలంగాణ మైనార్టీ విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. అనంతరం రేంజర్ పీ.స్నేహలత మాట్లాడుతూ మన భూగ్రహంపై అనేక ప్రాణులు, వృక్షజాలం సహజంగా విస్తరించి ఉన్నాయని, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని, వన్యప్రాణులతోనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని తెలిపారు. పర్యాటకం, ఆయుర్వేదం, పరిశోధనల ద్వారా వన్యప్రాణులు మన ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. మనుషుల నిర్లక్ష్యంతో అనేక జంతువులు, వృక్షజాలం అంతరించి పోతున్నాయని, వాటిని కాపాడటం అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ప్రాదేశిక.. నోటిఫికేషన్ నేడే

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల నోటిఫికేషన్ గురవారం విడుదలవుతున్నందున తొలివిడత నామినేషన్ల దాఖలు శుక్ర, శనివారాల్లో ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. తొలిరోజైన గురువారమే కొందరు నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలున్నాయి. ఇక ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది. అయితే హైకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందోనని అటు పార్టీలు, ఇటు ఆశావహులను ఆందోళన చెందుతున్నారు. పైకి ఎన్నికలకు సన్నద్ధమవుతున్నా కోర్టు నిర్ణయంపైనే ఎన్నికల తంతు ముడిపడి ఉందని, ఏదేమైనా నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధంగా ఉండాలంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ వామపక్షాలు, బీజేపీల నేతలు తమ కేడర్‌కు ఆదేశాలు జారీచేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల వేళ తమకు అనుకూలంగా ఉండే పార్టీలో చేరేందుకు స్థానిక నేతలు ఆసక్తి చూపుతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేశాం

» వీసీలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు వివరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే 149 ఎంపీటీసీ, 10జడ్పీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని బుధవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ వీసీకి హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ, ఎలక్టోరోల్ ప్రదర్శన, నామినేషన్ కేంద్రాల వద్ద 100మీటర్ల పరిధి స్పష్టంగా తెలిసేలా మార్కింగ్, బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో వాల్ క్లాక్ ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో తీయాలని, రిటర్నింగ్ అధికారి సీరియల్ నెంబర్ వారీగా నామినేషన్లను నమోదు చేయాలన్నారు. రోజు ఎన్ని నామినేషన్లు దాఖలు అవుతున్నాయో స్పష్టంగా వివరాలు నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షరైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీఎల్పీవో విజయలక్ష్మి, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మధిరలో జోరువాన

మధిర,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. గడచిన రెండు రోజుల నుంచి ఉక్కపోతకు అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కల్పించింది మధిర పట్టణంలో ఏ వీదిలో చూసిన మురుగునీరు రోడ్ల పైకి ప్రవహించింది. మండల వ్యాప్తంగా అర్దగంట పాటు భారీ వర్షం కురిసింది. రెండు నెలల నుంచి కురుస్తున్న వర్షాలు గత పది రోజులుగా తెరిపిని ఇవ్వడంతో పట్టణంలో రోడ్ల పైన ఉన్న బురద ఆరింది, వ్యవసాయ పనులు సాగుతున్నాయి రైతులు తమ పొలాల్లో అరకలు కట్టి పాట్లు చేసుకుంటున్నారు, ఈ వర్షంతో వ్యవసాయ పనులకు మరో రెండు రోజులు ఆటంకం ఏర్పడింది.



మధిరలో దృశ్యం

తిమ్మరావుపేట రోడ్డుపై నరకమే!

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు.. పట్టించుకోని అధికారులు

ఏన్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరావు పేట గ్రామంలో ప్రధాన రహదారి అధ్వాన స్థితిలో ఉంది. మోకాలిలోతు గుంటలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దుర్గంధం వస్తోంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఏన్కూరు నుంచి తిమ్మరావుపేట వరకు సుమారు 12కి.మీ. అధ్వాన స్థితిలో ఉంది. అడుగడుగున గుంటలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఈ రహదారిపై ప్రయాణం నరకయాతనగా మారింది. ఈ రహదారి గుండా ఖమ్మం, ఇల్లెందుకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. రాత్రివేళ్లలో బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఈ విషయమై అనేకసార్లు ఉన్నతాధికారులకు, ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వాన స్థితిలో తిమ్మరావుపేట రోడ్డు

ఇళ్లు, పని స్థలాన్ని శుభ్రంగా ఉంచుదాం

» ఒసీ పీవో ప్రహ్లాద్

సత్తుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటితోపాటు పని చేసే స్థలాన్ని శుభ్రంగా ఉంచుదామని జేవీఆర్ ఓసీ పీవో ఎన్వీఆర్.ప్రహ్లాద్ అన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 5.0 ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా మైన్‌ను, పంప్స్, ఎలక్ట్రికల్ సెక్షన్ పరిసరాలను శుభ్రపరిచారు. మైన్‌లో కూడా రోడ్లు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తమ ప్రభుత్వాలు తలపెట్టిన ఇలాంటి ఉన్నతమైన కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. పీఈ డీ.శ్రీనివాసరావు, ఎస్ఓఎం బీ.రాజేశ్వర్‌రావు, మేనేజర్ ఆపరేషన్స్ జీ.కల్యాణ్‌రామ్, వెల్ఫేర్ ఆఫీసర్ కే.దేవదాస్, యూనియన్ ప్రతినిధులు జీ.నరసింహారావు, రామారావు పాల్గొన్నారు.



జేవీఆర్ ఓసీలో మాట్లాడుతున్న పీఓ ప్రహ్లాద్

పోలీసుల సంక్షేమానికి పెట్రోల్‌బంక్

» సీపీ సునీల్‌దత్

కొణిజర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి పోలీస్ వెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ప్రారంభించారు. పోలీసు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొణిజర్ల పోలీసు స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే కాకుండా దీనిపై వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. పోలీసు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించే పోలీసు కంట్రోల్ బంక్‌కు మంచి గుర్తింపు వస్తుందన్నారు. అదేవిధంగా హెచ్ పీ పే యాప్ ద్వారా నగదు చెల్లింపులు జరిపితే డిస్కౌంట్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ రామానుజం, ఎస్‌బీ ఏసీపీ మహేష్, ఏఆర్‌ఏసీపీలు నరసయ్య, సుశీల్ సింగ్, నప్సాద్, సీఐ సాగర్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, నాగుల్ మీరా, కొణిజర్ల ఎస్ఐ సూరజ్ , హెచ్‌పీసీఎల్ ఆర్ఎం సమ్మయ్య పాలొగాన్నారు.





పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న సీపీ సునిల్‌దత్

సీజేపై దాడి రాజ్యాంగానికి అవమానం

ఖమ్మం అర్బన్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై జరిగిన దాడి యత్నం రాజ్యాంగానికే అవమానమని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వీ రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సనాతనధర్మం అంటూ అగ్రకుల అహంకారం చూపి ప్రధాన న్యాయ మూర్తిపై బూటు విసిరేందుకు యత్నించారన్నారు. దేశంలో పెరుగుతున్న అసహన, అమానుష, దళిత వ్యతిరేక ధోరణికి ఈదుశ్చర్య నిదర్శణం అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ పోషిస్తున్న అగ్రకుల మతోన్మాద అనాగరిక, అమానవీయ లౌకిక వ్యతిరేక ధోరణికి ప్రతిబింబం అన్నారు. నిందితుడిపైన అతని వెనుక ఉన్నప్రోత్సాహకులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒంటరి పోరుకు టీడీపీ సిద్ధం

ఏన్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరి పోరుకు టీడీపీ సిద్ధమైంది. ఒంటరిగా పోటీచేసి తమ సత్తా నిరూపించుకోవాలని భావిస్తోంది. కలిసి వచ్చే పార్టీలతో ముందుకు పోవడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు త్వరలో సమావేశం నిర్వహించి అభ్యర్థుల పేర్లను ఖరారు చేయనున్నారు. జడ్పీటీసీ స్థానానికి జిల్లా పార్టీ నాయకులు తాళ్లూరి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు జాస్తి జనార్ధన్, కొనకంచి రామకృష్ణ పోటీపడుతున్నారు. ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసి పోటీలో నిలపాలని పార్టీ భావిస్తోంది. ఆది నుంచి ఏన్కూరు మండలం టీడీపీకి కంచుకోటగా ఉంది. ఈ సందర్భంగా పార్టీ వీడిన వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేపడుతున్నారు.



మండల కమిటీ సమావేశం(ఫైల్ ఫొటో)

టీకాలతో రోగ నిరోధకశక్తి పెరుగుదల

ఎర్రుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో పిల్లలు అనారోగ్యం, అంగవైకల్యం బారిన పడకుండా రోగ నిరోధకశక్తి పెంపొందించడానికి ప్రభుత్వం ద్వారా వేయించే టీకాలు ఉపకరిస్తాయని జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ సీహెచ్‌వీ రమణ అన్నారు. మండలంలోని ఎర్రుపాలెం, జమలాపురం గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళిక ప్రకారం పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా పిల్లల్లో పుట్టుకతో వచ్చే అతి ప్రమాదకరమైన లోపాలను, వైకల్యాలను నిరోదించవచ్చన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తే తల్లి, బిడ్డ క్షేంగా ఉంటారు అని అన్నారు. అనంరతం టీకాల నిల్వ కేంద్రాన్ని, ఓపెన్వైల్ పాలసీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అశ్విని, సీహెచ్‌వో కాంతమ్మ, స్టాఫ్‌నర్స్‌లు అరుణ, ఫార్మసిస్ట్ అమృత్, సూపర్‌వైజర్లు వేణుగోపాల్, ఏఎన్ఎంలు పార్వతి, స్వప్న, స్నేహ, సుగుణ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



టీకాలపై అవగాహన కలిపిస్తున్న జిల్లా అధికారి రమణ

ఘనంగా గరుడోత్సవము

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమాన్ బజార్ శ్రీ స్తంభాద్రి వెంకటేశ్వర స్వామి 61వ వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారి గరుడోత్సవము ఘనంగా నిర్వహించారు. ఉదయం బిందె తీర్థం, ప్రాతరాధన, హవనము, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం స్వామి వారి గరుడోత్సవము కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈవో వేణుగోపాలాచార్యులు తెలిపారు.